'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

# ఏం తక్కువ చేసిండు కేసీఆర్!



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

**ఈ ప్రశ్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మాత్రమే కాదు... ఇప్పటికీ కేసీఆర్‌ను అనుమానపు దృక్కులతో చూస్తున్న కొందరు తెలంగాణ సమాజపు సభ్యులకు వేస్తున్నా. నిజానికి ఈ ప్రశ్న మనందరమూ వేసుకోవాలి. అద్దం ముందు నిలబడి నపుడు అడగాలి మనను మనం! బయలుపడక, లోపల్లో పలే తాబేలు తలలాగా ముడుచుకొని పోయిన అంతఃకరణను అడగాలి!**

**కేసీఆర్ పదేండ్ల తన పాలనలో, తాను సృష్టించిన రాష్ట్రాన్ని ఎంతగా దౌడు తీయించిన్రు అనేది మనందరి కండ్ల ముందున్న వాస్తవం. అది ఇంటిలోని కరెంటు వెలుగు కావొచ్చు, కండ్లలోని భవిష్యత్తు ఆశ కావొచ్చు, ఎడతెగక పారే మంచినీళ్ల పైపు కావొచ్చు, కడుపు నిండా పొలాలను తడిపే జీవధార కావొచ్చు! కంటివెలుగు, కేసీఆర్ కిట్, దళితబంధు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ దవాఖానాలు, సమీకృత కలెక్టరేట్‌లు, ఇట్లా ఏవైనా సరే ఆషామాషీగా జరగలేదు. మహోన్నత లక్ష్యంతో, మేగ్నానిమిటీతో చేసిన్రు కేసీఆర్.**

నేడు రేవంత్ రెడ్డి పాలనలో ఏ ఒక్కటీ దక్కడం లేదు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపే ప్రయత్నంలో మన అందరి కలలనే చెరిపి వేస్తున్నారాయన. రాష్ట్రమంతా అరాచకం ప్రబలింది. బెదిరింపులు, వసూళ్లు, హత్యలు, అత్యాచారాలు యథేచ్ఛగా సాగుతున్నయి. పోలీస్ స్టేషన్లలో కూచొని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సెటిల్మెంట్లు చేస్తున్నరు. సహచర ఉద్యోగినులపైనే అత్యాచారాలు చేయడానికి సైతం వెనుకాడటం లేదు పోలీసులు. శాంతిభద్రతలు లుప్తమై జనం పట్టపగలు నడిరోడ్లపై కొట్టుకు చస్తున్నరు. పోలీసు వ్యవస్థను చక్కదిద్దే తీరిక హోంమంత్రి కూడా అయిన సీఎంకు లేదు. ఎంతసేపూ క్షుద్ర రాజకీయం తప్ప ఆయనకు మరేదీ పట్టదు. ఆవు చేనులో మేస్తుంటే దూడ గట్టున మేస్తదా? తమ రోల్‌మోడల్‌ను చూసుకొని మంత్రివర్గ సహచరులు రెచ్చిపోతున్నరు. హక్కులు అడిగినవాళ్లను చెప్పుతో కొడతా అంటున్నరు. అధికారులపై కాగితాలు విసిరివేస్తున్నరు. అదుపుతప్పిన పాలనలో ప్రజా సమూహంలోని అసాంఘిక శక్తులకు మాత్రం ఎందుకు భయం ఉంటది? కాబట్టే విచ్చలవిడి తనం రాజ్యమేలుతున్నది.

దీనినేనా 'అద్భుత పాలన' అన్నరు మీరు పోచారం సారూ?! ఎందుకింత స్వీయహననం!

'దొంగలు కొంతమంది పోయిన్రు, పోనీ. నికార్సయిన నాయకులు ఉన్నరు మన దగ్గర. ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పదవులు అనుభవించి, ఆస్తులు కూడబెట్టుకొని, కష్టకాలంలో పార్టీని వదలిపోవడం మానవత్వం కాదు. ఇపుడు కేసీఆర్‌కు ధైర్యం, బలం ఇచ్చే అసలైన నాయకులు, కార్యకర్తలు ఎంతోమంది ఉన్నరు బీఆర్ఎస్‌లో...' అని ఈ మధ్యనే అంటిరే? ఇంతలోనే ఏమి అజ్ఞానోదయం జరిగిందో మరి, ఇన్నేళ్ల తమరి ఇమేజ్‌ను పాతాళం లోతు పాతిపెట్టుకున్నరు!

రేవంత్ 'అద్భుత పాలనలో'... ఉచిత బస్సు తప్ప ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు కాంగ్రెస్ ప్రభుత్వం. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మరీ ఆగస్టు 15కు పలుమార్లు వాయిదా వేసిన రుణమాఫీకి అతీగతీ లేదు. రుణమాఫీ సహా రైతుబంధు కూడా ఎగవేయడానికి మంత్రివర్గ ఉపసంఘం వేసి, అదేదో ఘనకార్యంలాగ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పుకొన్నరు. దేశాన్ని మొత్తం తన అనుయాయులకు దోచిపెట్టే మోదీ-షా ద్వయం మన సింగరేణిలో యథేచ్ఛగా వేలం పాటలు పాడుతూ ఉంటే, ఈ రాష్ట్ర ప్రయోజనాలను వేలం వేస్తున్నరు రేవంత్ రెడ్డి.

తమ మంత్రిత్వశాఖలపై మంత్రులకు పట్టు లేదు. వారికి తెలియకుండా నిర్ణయాలు జరుగుతున్నయి. పక్క రాష్ట్రం నుంచి వచ్చే ఆదేశాలు అమలుచేస్తూ చడీ చప్పుడూ లేకుండా జీహెచ్ఎంసీ కూల్చివేతలు చేస్తున్నది. ఎక్సైజ్ మంత్రికి తెలియకుండా మద్యం కంపెనీలు చీప్ బ్రాండ్స్‌తో ముంచెత్తుతున్నయి. అరాచకత్వం తారాస్థాయిలో ఉండే కాంగ్రెస్ సంస్కృతి విషఫలితాలు మనందరం అనుభవిస్తూ ఉన్నం. అయినా, పోచారం శ్రీనివాస్‌రెడ్డి రేవంత్ పాలన పట్ల వ్యామోహపడ్డారట. చిత్రమేమంటే, 'పోచారం వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలందించారని, వ్యవసాయరంగ ప్రగతి కోసం ఆయన సలహాలు స్వీకరిస్తాం' అని ఆయన చేరిక సందర్భంలో రేవంత్ అన్నరు. వ్యవసాయ మంత్రిగా పోచారంకు కీర్తి కిరీటాలు వచ్చింది కేసీఆర్ పాలనలోనే! స్వాతంత్ర్యం వచ్చిన ఏడున్నర దశాబ్దాల కాలంలో కనీవిని ఎరుగని రీతిలో దేశంలోనే అగ్రగామి వ్యవసాయోత్పత్తి రికార్డు తెలంగాణకు, పోచారంకు సాధించి పెట్టింది కేసీఆర్ దార్శనికత, చిత్తశుద్ధి, దృఢ సంకల్పం, విధానాలు, నిర్ణయాలు, కార్యాచరణ!

ఎవరినీ తక్కువ చేయటం నా ఉద్దేశం కాదు గానీ, పోచారం స్థానంలో ఎవరున్నా కేసీఆర్ అదే రీతి ఫలితాలు సాధించిపెట్టేవారు. అనంతర కాలంలో నిరంజన్‌రెడ్డి వ్యవసాయ మంత్రిగా ఉన్నపుడు కొనసాగిన ఒరవడి ఇందుకు తిరుగులేని దృష్టాంతం!

మరి తనకు గాని, వ్యవసాయానికి గాని కేసీఆర్ పాలనలో ఏం తక్కువ జరిగిందని పార్టీ మారినట్టు పోచారం? రేవంత్‌రెడ్డి 'అద్భుత అభివృద్ధి' ఎక్కడ కనిపించింది ఆయనకు? కరెంటు లేక, నీళ్లు రాక, రైతుబంధు దక్కక అల్లల్లాడుతున్నది రైతాంగం. కష్టపడి పండించిన పంటను కొనండి అంటూ మంత్రుల, అధికారుల కాళ్లపైన పడుతున్న దైన్యం మనకందరికీ కనపడింది. ప్రజలకు అందని అసలు సిసలైన దొరల పాలన, గడీల పాలన రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో చవి చూస్తున్నది తెలంగాణ. దొరతనం ఒక కులానికి చెందినది కాదు, ఆధిపత్య ధోరణికి సంబంధించినది! యాదగిరి లక్ష్మీనరసింహుని సమక్షంలోనే ఒక దళిత మంత్రిని, ఒక బీసీ మంత్రిని నేలపై కూచోపెట్టి; సీఎం దంపతులు సహా నలుగురు రెడ్లు కుర్చీలలో కూర్చోవడం కంటే దొరతనం ఏముంటుంది? నిన్నటి దృశ్యం కూడా ఒకసారి రివైండ్ చేసి చూడండి. రేవంత్‌రెడ్డి డాంబికంగా, దర్జాగా సోఫాలో వెనక్కి ఆనుకొని భగవంతుడి పోజులో కూచుంటే, పోచారం ఒద్దికగా కూచుని ఉన్నరు. కేసీఆర్ దగ్గర ఎపుడైనా జరిగిందా అట్లా? 'తమరు' తప్ప వేరే సంబోధన ఎరుగుదురా పోచారం అయినా, కేకే అయినా?!



**ఇతర కులాల దాకా ఎందుకు, 'పేద రెడ్లను కూడా మా ఇంట్లోకి రానీయం' అని ఇదే రేవంత్ అన్న వీడియోలు ఉన్నయి కదా పబ్లిక్ డొమైన్‌లో? పోచారం శ్రీనివాస్ రెడ్డినే ఇష్టమొచ్చిన కూతలు కూసింది రేవంత్ కాదా? ప్రత్యర్థి శిబిరాల్లోని నాయకులను విమర్శించడం రాజకీయాల్లో సహజం. 'త్వం శుంఠ, త్వం శుంఠ' అని ఇద్దరూ అనుకుంటేనే కదా ప్రజలకు ఒక అయిడియా వచ్చేది, ఎవరు ఎక్కువ శుంఠలో! కాబట్టి, విమర్శలు అవసరమే కానీ రేవంత్ రెడ్డి 'బిలో ది బెల్ట్' మాటల నుంచి పోచారం కూడా తప్పించుకోలేదు కదా? ఏ రకంగా రేవంత్‌రెడ్డి మంచివాడు? పాలనలోనా, పరిణతిలోనా?**

కన్యాశుల్కంలో మధురవాణి అంటరు 'సాని దానికి మాత్రం నీతి ఉండొద్దా' అని. 'ఫిరాయింపులు స్థూలంగా తప్పేమీ కావు' అని సామాన్య ప్రజలు కూడా అనుకునే రోజులు కాబట్టి వాటికి పెద్ద విలువ ఏమీ లేదు. అయితే, ఎందుకు ఫిరాయిస్తున్నరనేది ముఖ్యం. ఏమి సాధించడానికి, ఎవరిని బలోపేతం చేయడానికి అనేది ముఖ్యం. ఈ రాష్ట్ర ప్రజల జీవితాలను ఆర్నెల్లలోనే పదేండ్లు వెనక్కు తీసుకుపోతున్న కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం ముమ్మాటికీ తెలంగాణకు ద్రోహమే! మరోమాట లేదు. తమకూ, తమ కుటుంబానికీ ఎన్నో అవకాశాలు, పదవులు దక్కించుకుని; ఆస్తులు కూడబెట్టుకుని; పార్టీలో, ప్రభుత్వంలో అగ్రతాంబూలం అందుకుని; కష్టకాలంలో ఫిరాయిస్తున్నరంటే ప్రజలు అసహ్యించుకుంటరు. అలాంటి ముగ్గురు నాయకులను మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించిన్రు. సునీతా మహేందర్‌రెడ్డి, గడ్డం రంజిత్ రెడ్డి, దానం నాగేందర్‌లను నేలకేసి కొట్టిన్రు.

శల్యుడిని తమ వైపు తిప్పుకొని, శ్రీకృష్ణుడిని కూడా తమ పెరట్లో కట్టేసుకోవాలని అనుకునే కౌరవుల అధర్మబుద్ధికీ... కర్ణుడిని తమ శిబిరంలో చేర్చుకోవాలనుకున్న శ్రీకృష్ణుడి ఆలోచనకు తేడా ఉన్నది! అన్నింటినీ ఒకే గాటన కట్టలేం. తన సొంత సోదరుడు నీతి తప్పినపుడు ధిక్కరించిన వికర్ణుడు, యుయుత్సుడు మహాభారత ఆదర్శం కదా? ఫిరాయింపులు అంటే అట్లా ఉండాలి కదా? పన్నెండు మంది కాంగ్రెస్ సభ్యులు బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన తర్వాత వారి వారి నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, స్థూలంగా రాష్ట్ర అభివృద్ధిలో వారి పాత్ర అనే అంశాన్ని... ఇపుడు కాంగ్రెస్‌లోకి ఫిరాయిస్తున్నవారి వల్ల వారికీ రాష్ట్రానికీ జరిగే మేలు/కీడు అనే అంశాన్ని బేరీజు వేసి చూస్తది సమాజం! కాబట్టే, 'ఫిరాయింపులు మీరు చేయలేదా' అనే కాంగ్రెస్ ప్రశ్నలకు బలం ఏమీ లేదు.

**గతంలో ఇదే రేవంత్ తానూ, తను పనిచేసే పార్టీ రాష్ట్ర ఏర్పాటును ఎంతగా అడ్డుకున్నా కూడా... ఎందరో త్యాగాల ఫలితంగా ఆవిర్భవించిన రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్నే కూల్చాలని చూసి, డబ్బుల కట్టలతో దొరికిపోయిన దొంగ కాదా? కాబట్టే ఇప్పుడు ఆయన ఎన్ని మాట్లాడినా విశ్వసనీయత ఉండదు.**

కష్టపడి తెచ్చుకున్న తెలంగాణకు నష్టం చేసేవాళ్లను పట్టుకోవడానికి ఫోన్ ట్యాపింగ్ జరిగితే గిరిగితే మాత్రం తప్పు ఎట్లా అవుతుంది? తెలంగాణను అవమానించిన మీడియాను ఏండ్ల పాటు నిషేధిస్తే తప్పు ఎట్లా అవుతుంది? నిరంతరమూ కుట్రలే జీవనమార్గంగా ఉన్న శక్తులు తాము దొరికిపోయినపుడు అధర్మం అధర్మం అని ఆవులిస్తే ఎట్లా? నిరాయుధుడైన అభిమన్యుడిని నీతి నియమాలు ఒదిలి హత్య చేసినపుడు లేని ధర్మం, నిండు సభలో ద్రౌపది వలువలూడుస్తున్నపుడు లేని నీతి... రథం కుంగినపుడు గుర్తు వస్తే ఎట్లా? తమ్ముడిని రాజ్య భ్రష్టుడిని చేసి, భార్యను చెరబట్టినపుడు లేని ధర్మం... చెట్టు చాటు నుంచి బాణం దూసుకువస్తున్నపుడు గుర్తు వస్తే ఎట్లా? తాము లెక్కలు వేసుకుంటూ బతుకుతూ, ఎదుటివారికి విలువలు ఉండాలనడం ఏమి న్యాయం?

'రామాయణ, భారతాలు ఈ దేశ ప్రజల చైల్డ్ హుడ్ ఆల్బమ్...' అంటరు ప్రముఖ కవి, రచయిత, నాటకకర్త, సోషల్ సైంటిస్ట్ సౌదా! ఆ సాంస్కృతిక వారసత్వం ఉంది కాబట్టే భారతీయులు విచక్షణాపరులు. నీళ్లనూ పాలనూ ఇట్టే వేరు చేయగలరు. నీతి-నీతిబాహ్యత వెనుక ఎవరి ప్రయోజనాలున్నయో చూడగలరు. సహనశీలత చూపిస్తూనే కటువుగా ఉండగలరు. దైవాంశ సంభూతులమని భావించేవారిని నేలకు దించగలరు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకిదే అనుభవం ఇచ్చిన్రు. అయితే, ఒక్కోసారి చేసిన తప్పులకు మించి అన్యాయపు శిక్షలూ వేయగలరు, కేసీఆర్‌కు వేసినట్టు, తద్వారా తెలంగాణ తనకు తాను వేసుకున్నట్టు!

కానీ... అరణ్యవాసాలు, అజ్ఞాతవాసాలూ దేవుడికే తప్పలేదు. మానవులెంత? పార్టీలు ఎంత? కేసీఆర్ స్వయంగా అంటరు కదా 'అధికారమే పరమావధి కాదు మాకు, ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా పరిపూర్ణంగా చేస్తం, సంపూర్ణంగా బాధ్యత చేపడుతాం' అని. ఇపుడు వారి నేతృత్వంలో ప్రతిపక్షపు పనులు అట్లే జరుగుతున్నయి. ఆయన కొరడా ఝుళిపిస్తేనే కదా నీళ్లు పారింది, అక్రమాలకు చెక్ పడుతున్నది. ఇపుడు కాంగ్రెస్-బీజేపీల నుంచి సింగరేణిని కాపాడేది ఈ ప్రతిపక్షమే కదా?

ఇపుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు చరిత్రాత్మకమైన పాత్ర ఉన్నది. ఆలోచించి అడుగు వేస్తరో, పోచారం లాగ భ్రష్టు పట్టిపోతరో వారి ఇష్టం. పద్దెనిమిది అక్షౌహిణుల కౌరవ సైన్యంతో తలపడింది ఏడు అక్షౌహిణుల పాండవ సైన్యం కాదు, ధర్మంపై వారికున్న నమ్మకం! ఇపుడు తెలంగాణను కాపాడే రాజధర్మం ప్రభువులు మరచినా, ప్రధాన ప్రతిపక్షం మరవదు. తన బిడ్డ కదా మరి! బిడ్డకే బిడ్డ కదా తను!

ఇది గ్రహించిన వారికి, పేగుబంధం తెలిసినవారికి ఎన్ని కష్టాలైనా లెక్క కాదు. కాబట్టి, బీఆర్ఎస్ నాయకులు సహా, ఇంకా ఏమైనా సందేహాలు, మీమాంసలున్న ఎవరైనా ఆగండి, ఆలోచించండి!

మరొక్క విషయం చెప్పి ముగిస్తా! ఇంటి శత్రువుల సంగతి ఇట్లా ఉంటే... బయటివారు ఎట్లున్నరో చూడండి. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ పేలుతున్నడు బీఆర్ఎస్ నుంచి మరో 22 మందిని ఆకర్షిస్తే సరిపోతుంది రేవంత్ అని. ఎత్తొండలో పుట్టిన తెలంగాణ వాడిని అని ఆయన ఎంతగా మొత్తుకున్నా ఆంధ్రజ్యోతి ఆఫీసులో సైతం ఎవరూ నమ్మరు ఆయనలో తెలంగాణ ఆత్మ ఉందని. ఇపుడు ఆయన చంద్రబాబు, రేవంత్‌ల అజెండాను అమలుచేస్తున్నడు. నిజానికి రెండు రాష్ట్రాలకు కొత్త రాజగురువుగా అవతారం ఎత్తాలని చూస్తున్నడు. కాబట్టే, బీఆర్ఎస్ పార్టీని ఇబ్బందులు ఎట్లా పెట్టాలని కథనాలు వారుస్తున్నడు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా పొడిగించాలని ఆంధ్రా రాజకీయ పార్టీలకు జేడీ లక్ష్మీనారాయణ చేసిన విజ్ఞప్తి కూడా మనకు వార్నింగ్ బెల్స్‌గానే చూడాలి. ఏపీ మాజీ ముఖ్యమంత్రి హైదరాబాద్ ఇంటి దగ్గర కూల్చివేతలకు జీహెచ్ఎంసీ ఎవరి ఆదేశాలు తీసుకొని పూనుకుందో కూడా తెలిస్తే విషయం అర్థమవుతుంది. 2014కు మునుపటి చీకటి రోజుల్లోకి తెలంగాణను తీసుకుపోయే అజెండా కాంగ్రెస్ ప్రభుత్వానిది. అందుకు తోడ్పాటు అందిస్తున్న తాజా ద్రోహి పోచారం శ్రీనివాస్ రెడ్డి. Nothing more, nothing less!

**రేవంత్ 'అద్భుత పాలనలో'... ఉచిత బస్సు తప్ప ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు కాంగ్రెస్ ప్రభుత్వం. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మరీ ఆగస్టు 15కు పలుమార్లు వాయిదా వేసిన రుణమాఫీకి అతీగతీ లేదు. రుణమాఫీ సహా రైతుబంధు కూడా ఎగవేయడానికి మంత్రివర్గ ఉపసంఘం వేసి, అదేదో ఘనకార్యంలాగ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పుకొన్నరు. దేశాన్ని మొత్తం తన అనుయాయులకు దోచిపెట్టే మోదీ-షా ద్వయం మన సింగరేణిలో యథేచ్ఛగా వేలం పాటలు పాడుతూ ఉంటే, ఈ రాష్ట్ర ప్రయోజనాలను వేలం వేస్తున్నరు రేవంత్ రెడ్డి.**

**అందరినీ ఒకే గాటన కట్టే ట్రాప్‌లో పడవద్దని తెలంగాణకు విజ్ఞప్తి. కేసీఆర్ చేసినవి చిన్నవో పెద్దవో పొరపాట్లు ఉంటే ఉండవచ్చును, అవన్నీ సరిదిద్దుకోగలిగేవే. రేవంత్ ప్రభుత్వం చేస్తున్నవి పొరపాట్లు కాదు, ద్రోహం. అవి సరిదిద్దలేనివి! విచక్షణతో మసలుకో తెలంగాణ! కేసీఆర్ ఎవరికీ ఏమీ తక్కువ చేయలేదు!**

---

## లేఖ

### సన్నద్ధమయ్యేందుకు సమయమివ్వాలె!

టీచర్ కొలువుల భర్తీ కోసం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ పరీక్ష తేదీని పొడిగించాలి. తాజాగా టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని మొదట ప్రభుత్వం పరీక్ష తేదీని నిర్ణయించింది. కానీ, చాలా తక్కువ సమయం ఉండటంతో పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. అతి తక్కువ సమయంలో సిలబస్ మొత్తాన్ని తిరగేయడం అంటే మాటలు కాదు. అందుకే పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం ఇవ్వాలి. కనీసం మరో రెండు నెలల గడువు ఇవ్వాలి. నిరుద్యోగులకు అండగా నిలబడతామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకోవాలి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటులో నిరుద్యోగుల కీలకపాత్ర ఎనలేనిది. కాబట్టి పరీక్ష తేదీని పొడిగించి, తగిన సమయమిచ్చి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి.

- మధునూరే రాహుల్

### బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకులు!

*బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే పేపర్ లీకులు జరుగుతున్నాయి. నీట్ ఉదంతంలో ప్రధాన నిందితుడైన సంజయ్ ముఖియాను పోలీసులు ఉద్దేశపూర్వకంగానే అరెస్టు చేయడం లేదు. బడా రాజకీయ నాయకులతో అతనికి సన్నిహిత సంబంధాలు ఉండటమే అందుకు కారణం. త్వరలోనే అన్ని విషయాలు బయటపెడతాం.*



*- తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత*

---

# భూమికి పచ్చాని రంగేసినట్టు!

పరాయి పాలనలో విధ్వంసమైన తెలంగాణ 'పల్లె పల్లెనా పల్లేర్లు మొలిచే తెలంగాణలోనా.., నా పంట చేలలోనా!' అంటూ విషాదగీతం పాడుకున్నది. నీళ్లు లేక, కరెంటు రాక బీళ్లుగా మారిన భూములను చూసి రైతన్న పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం వలసబాట పట్టిండు. పద్నాలుగేండ్ల పోరాట ఫలితంగా తెలంగాణ స్వప్నం సిద్ధించింది. పరాయి పాలనలో దండుగన్న వ్యవసాయం స్వపరిపాలనలో ఒక్కసారిగా పండుగైంది. వలసలు పోయిన రైతాంగం తమ తమ ఊళ్లకు తిరుగు పయనమైంది. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎక్కడ చూసినా 'భూమికి పచ్చాని రంగేసినట్టు...' పచ్చగా కళకళలాడింది.



ఎడిటోరియల్ డెస్క్

*దండుగన్న ఎవుసం సంకురాత్రి
పండుగైంది
పల్లేర్లు మొలిచిన భూములు పచ్చని
చీర కట్టుకున్నయ్
ఆకలికి ఏడ్చిన కడుపులు.. అన్నం
బెట్టే అక్షయ పాత్రలైనయ్
ఉపాధి లేక వలసబాట పట్టి
బిక్కచచ్చిన ముఖాలు..
చేతినిండా పనితో మూడుంగాలాల
కైకిలితో నవ్వినయ్
నిరంతరాయ ఉచిత కరెంటుతో
పదేండ్ల తెలంగాణలో
పచ్చని పల్లెలు ధాన్యరాశుల
గుట్టలుగా మారిన వైనమిది
2 కోట్ల ఎకరాల మాగాణంగా
తెలంగాణ మారిన చరిత్ర ఇది..*

2014 కంటే ముందు తెలంగాణలో ఎటుచూసినా బీడు భూములే. కరెంటు కోతలతో పంటపొలాలు నీళ్లులేక ఎండిపోయేవి. క్షామంతో ఏకంగా పల్లెలకు పల్లెలే వలసబాట పట్టేవి. 'పల్లె పల్లెనా పల్లేర్లు మొలిచే నా తెలంగాణలోనా..!' అంటూ ఎక్కడ చూసినా విషాద గీతాలే వినిపించేవి. రాష్ట్ర జనాభాలో దాదాపు 70 శాతానికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇది తెలిసినప్పటికీ 'ఎవుసం దండుగ' అన్నట్టుగా సమైక్య పాలకులు వ్యవహరించారు. దీంతో రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతు ఆత్మహత్యలు, వలసలు. అయితే, 2014లో ప్రత్యేక రాష్ట్రంలో అధికారంలోకి రాగానే సాగు రంగంపై అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. వానల మీదనే ఆధారపడి పంటలు పండించే తెలంగాణ రైతన్నలకు సాగుకు అవసరమైన కరెంటును ఇస్తేనే, ఎవుసం పండుగైతదని సంకల్పించారు. తొమ్మిదిన్నరేండ్లలో అదే చేసి చూపించారు. అలా బువ్వ కోసం పక్క చూపులు చూసే ఒకప్పటి తెలంగాణ.. 2 కోట్ల ఎకరాల మాగాణంగా మారింది.



**బీడు భూములకు జలకళ:** తెలంగాణ రైతులకు సాగు సవాళ్లతో కూడుకొన్న వ్యవహారం. వానకాలంలో వర్షాలు పడితేనే పంటలు సాగయ్యేవి. యాసంగిలో భూములన్నీ బీడుగానే ఉండేవి. కరెంటు కోతలతో సరైన సాగునీటి వసతి లేకపోవడంతో తెలంగాణ కరువుకు చిరునామాగా ఉండేది. తెలంగాణ సాకారమయ్యాక, అప్పటి సీఎం కేసీఆర్ సాగునీటి గోస తీర్చడంపై దృష్టి సారించారు. ముందుగా కోతలనేవే లేకుండా వ్యవసాయానికి అవసరమైన కరెంటును ఇవ్వాలని ప్రతినబూనారు. అత్యంత ప్రయాసకోర్చి రాష్ట్రాన్ని, రైతులను విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కించారు. 2016 ఏప్రిల్ 1 నుంచి వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును, 2018 జనవరి 1 నుంచి 24 గంటల ఉచిత విద్యుత్తును సాగు కోసం ప్రభుత్వం నిరంతరాయంగా సరఫరా చేసింది. ఇందు కోసం ఏటా రూ. 5 వేల కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించింది. మిషన్ కాకతీయలో భాగంగా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం ఫలాలు వెరసి బీడు భూములకు జలకళ వచ్చింది. దీంతో 2014-15లో యాసంగి, వానకాలం కలిపి 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2022-23లో 2.09 కోట్ల ఎకరాలకు పెరిగింది. అదనంగా ఏటా 15-20 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి.

### ధాన్యం కొనుగోలు వివరాలు




| సంవత్సరం | ధాన్యం కొనుగోలు (లక్షల టన్నులు) | విలువ (రూ. కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 24.29 | 3,353 |
| 2015-16 | 23.56 | 3,369 |
| 2016-17 | 53.69 | 8,000 |
| 2017-18 | 77.46 | 13,633 |
| 2019-20 | 111.25 | 20,304 |
| 2020-21 | 141.11 | 26,500 |
| 2021-22 | 120.33 | 23,466 |
| 2022-23 | 130.82 | 26,901 |

**మీకు తెలుసా?**

**77 ఏండ్ల స్వతంత్ర భారతంలో దేశవ్యాప్తంగా పెరిగిన సాగు విస్తీర్ణం 6.7 శాతం కాగా.. కేసీఆర్ పాలనలో తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణం 60 శాతం.**

**గుట్టలుగా ధాన్యపు రాశులు:** తినడానికి సరిపడా పంట పండితే చాలనుకొన్న ఒకప్పటి తెలంగాణ.. ఇప్పుడు దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారింది. సాగు రంగానికి కేసీఆర్ సర్కారు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయడమే దీనికి ప్రధాన కారణం. ఉచిత విద్యుత్తుతో సాగు విస్తీర్ణం 2 కోట్ల ఎకరాలకు పైగా పెరిగింది. దీంతో ధాన్యం రాశులు పల్లెల్లో రోడ్ల మీద గుట్టలుగా దర్శనమిచ్చాయి. 2014కు ముందు ధాన్యం కొనుగోళ్లలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ.. ఇప్పుడు పంజాబ్‌తో పోటీ పడుతూ అగ్రస్థానానికి ఎగబాకింది.

### వ్యవసాయ కూలీల రోజువారీ కనీస సగటు కూలీ..



| రాష్ట్రం | 2023లో సగటు రోజు కూలీ (రూ.) | 2016-17తో పోల్చితే పెరుగుదల రేటు (శాతం) |
|---|---|---|
| తెలంగాణ | 462 | 58.9 |
| మహారాష్ట్ర | 372 | 24 |
| కర్ణాటక | 353 | 8.6 |
| బీహార్ | 309 | 25.3 |
| ఉత్తరప్రదేశ్ | 288 | 27.6 |
| మధ్యప్రదేశ్ | 282 | 17.1 |
| గుజరాత్ | 237 | 29 |

### తొమ్మిదేండ్లలో సాగు విస్తీర్ణంలో మార్పు

2014లో..1.31 కోట్ల ఎకరాలు
2023లో..2.09 కోట్ల ఎకరాలు
పెరుగుదల..60 శాతం

### వానకాలం-యాసంగి కలిపి సాగు విస్తీర్ణంలో మార్పు ఇలా..

| సంవత్సరం | సాగు విస్తీర్ణం (కోట్ల ఎకరాలు) |
|---|---|
| 2014-15 | 1.31 |
| 2015-16 | 1.21 |
| 2016-17 | 1.48 |
| 2017-18 | 1.50 |
| 2018-19 | 1.43 |
| 2019-20 | 1.88 |
| 2020-21 | 2.04 |
| 2021-22 | 1.95 |
| 2022-23 | 2.09 |



2014లో రాష్ట్రంలో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 2023 నాటికి ఇది 2.60 కోట్ల టన్నులకు పెరిగింది. ఈ విషయంలో దేశంలో రాష్ట్ర వాటా 14 శాతం. 2014-15లో వరి సాగు రెండు సీజన్లలో కేవలం 34.98 లక్షల ఎకరాల్లో సాగయితే, 2022-23లో ఏకంగా 1.21 కోట్ల ఎకరాల్లో సాగైంది. ఇది రికార్డు.

**మీకు తెలుసా?**

**కేసీఆర్ ప్రభుత్వం లాగా సాగుపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారిస్తే, వచ్చే ఇరవై ఏండ్లకు సరిపడా ధాన్యరాశులను ఒక్క ఏడాదిలోనే పండించే స్థాయికి భారత్ చేరుకొంటుంది.**

**వలసపోయిన పల్లెలు ఇప్పుడు ఉంటేగా!:** కేసీఆర్ హయాంలో సాగు రంగానికి తగినంత విద్యుత్తు సరఫరాతో వ్యవసాయ స్థిరీకరణ జరిగింది. దీంతో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెను, ఎవుసాన్ని విడిచి వెళ్లిన రైతులు తిరిగి పల్లెలకు చేరుకున్నారు. ఒకనాడు వలసపోయిన తెలంగాణ పల్లెలకే ఇతర రాష్ట్రాల కూలీలు వలస వచ్చారు. 2011 లెక్కల ప్రకారం.. తెలంగాణలో దాదాపు 31 లక్షల మంది సాగుదారులు ఉండగా.. 30-40 లక్షల మందికి పైగా వ్యవసాయ కూలీలున్నారు. ఉమ్మడి పాలనలో తెలంగాణలో వ్యవసాయ సీజన్‌లో నికరంగా 120-180 రోజులకు మించి పనులు ఉండేవి కావు. అయితే, 2014 తర్వాత పంటలు దండిగా పండి కూలీలకు 300 రోజులకు పైగా పనులు దొరికాయి. దీంతో ఒకప్పటి వలసల తెలంగాణ.. దేశానికే అన్నంపెట్టే అన్నపూర్ణగా మాత్రమే కాదు, వ్యవసాయ కూలీలను ఆదుకొన్న కల్పవల్లిగానూ మారింది.